
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 10 మార్చి 2024





ఇంటర్ అడ్మిషన్లకు కార్పొరేట్ వల

- తల్లిదండ్రులతో సంప్రదింపులు
- కార్పొరేట్ కళాశాల పీఆర్వోల ఒప్పందాలు
- పరీక్షల కంటే ముందే విస్తృత ప్రచారం
- జిల్లాలో పదోతరగతి విద్యార్థులు 6475 మంది
- మార్చి 18 నుంచి 30 వరకు పరీక్షలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల కోసం కార్పొరేట్ కళాశాలలు వేట ప్రారంభించాయి. పది పరీక్షలు పూర్తి కాకముందే అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులతో సంప్రదింపులు జరుపుతున్నాయి. ఆలస్య మైతే కళాశాలల్లో సీట్లు దొరకడం కష్టమంటూ అయోమయానికి గురి చేస్తున్నాయి. అడ్మిషన్లకు ఆలస్యమైతే ఫీజులు ఎక్కువగా అడుగుతారనే ఆందోళనతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కార్పొరేట్ వలలో పడుతున్నారు. జిల్లాలో 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల యజమాన్యాలు అడ్మి షన్లు ప్రారంభించాయి.పదోతరగతి పరీక్షలు ప్రారంభం కాకముందే ఆయా కళాశాలల పీఆర్వోలు తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మరీ అడ్మిషన్ల కోసం ఒప్పందాలు చేసుకుంటున్నాయి. మరోవైపు ఫీజులు లక్షల్లో ఉండ డంతో పిల్లలకునాణ్యమైన విద్యను అందాలని తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

18 నుంచి పరీక్షలు.. 6,475 మంది విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ విద్యా సంవత్సరం 6475 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. వీరిలో బాలురు 3075 మంది, బాలికలు 3400 మంది ఉన్నారు. ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 102 మంది ఉన్నారు.బాలురు 60 మంది, బాలికలు 42 మంది చదువు తున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2873 మందికి బాలురు 1649, బాలికలు 1224 మంది, మోడల్ స్కూల్‌లో 663 మందికి బాలురు 349, బాలికలు 314 మంది, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 1103 మందికి బాలురు 319, బాలికలు 784 మంది ఉన్నారు. కేజీబీవీలో 465 మంది బాలికలు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 1269 మంది విద్యార్థులకు బాలురు 698, బాలికలు 571 మంది ఉన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఓఎస్ఎస్‌సీకి సంబంధించిన పరీక్షలు ఉన్నాయి. 18న మొదటి లాంగ్వేజ్ పరీక్ష, 19న సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష, 21న ఇంగ్లీష్, 23న మ్యాథ్స్, 26న సైన్స్ (ఫిజికల్‌సైన్స్) 28న సైన్స్ (బయలాజికల్ సైన్స్), 30న సోషల్ స్టడీస్, ఏప్రిల్ 1న ఓఎస్ఎస్‌సీ మొదటి పరీక్ష లాంగ్వేజ్ సంస్కృతం, లేదా అరబిక్, ఒకేషనల్ కోర్సు థి యరీ, 2వ తేదీన సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందు కు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నారు.పరీక్ష రాయకముందే వీరిని తమ కళాశాలల వైపు తిప్పుకోవడానికి కార్పొరేట్ యాజమాన్యాల ప్రయత్నాలు మొదలయ్యాయి.

విస్తృత ప్రచారం..

పదోతరగతి పరీక్షలు ప్రారంభం కాకముందే ఇంటర్ అడ్మిషన్ల ప్రచారం జోరుగా సాగుతోంది. కన్సల్టెన్సీలు, ప్రైవేటు కళాశాలల పీఆర్వోలు జిల్లాలోని విద్యార్థుల అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. ఈ నెలలోనే పది పరీక్షలు పూర్తి కానున్నాయి. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అడ్మిషన్లపై ఒత్తిడి పెంచుతున్నారు. ఒక్కో విద్యార్థిపై అడ్వాన్స్‌లు తీసుకుంటున్నారు. అడ్మిషన్లు సేకరించిన పీఆర్వోకు ఒక విద్యార్థిపై రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు కమీషన్ అందుతున్నట్లు చెప్పుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులు హైదరాబాద్ నగరంలోని కార్పొరేట్ కళాశాలల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని కళాశాలల్లో సరైన ల్యాబ్‌లు, లెక్చరర్లు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రైవేటు కళాశాలల్లో చేర్పించడానికి మొగ్గు చూపుతున్నారు. హైదరాబాద్ కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నాయి. పీఆర్వోలు, కన్సల్టెన్సీల మాటలు విని చేర్పించిన తరువాత హాస్టల్‌లో సరైన వసతి లేకపోవడం, భోజన సౌకర్యం సరిగా లేకపోవడం వంటి కారణాలతో చాలా మంది విద్యార్థులు తిరిగి వస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి.



వెళ్లొస్తాం.. రాజన్నా

- వేములవాడలో ముగిసిన మహాశివరాత్రి జాతర
- తిరుగు ముఖం పట్టిన భక్తులు



దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు శనివారం ముగిశాయి. గురువారం ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజులపాటు అత్యంత వైభవంగా సాగాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రధానంగా శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. ఆలయ ఆవరణలో శుక్రవారం రాత్రి జాగరణ పాటించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల ముగింపుతో ఇళ్లకు బయల్దేరిన భక్తులు ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకొని 'వెళ్లొస్తాం.. రాజన్నా.. వచ్చే ఏడాది మళ్లీ వస్తాం.. చల్లంగా చూడు' అంటూ స్వామివారిని వేడుకున్నారు.

7 ■ వేములవాడ

నేడు రంగినేని ఎల్లమ్మ జాతీయ సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)





'రెప్పవాలని రాత్రి' కవితా సంపుటి, రచయిత వంశీకృష్ణ

సాహిత్య పరుగులకు వారధిగా దశాబ్దాల కాలంగా రంగినేని ట్రస్ట్ సాహిత్య కారులను ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తోంది. ఇందులో భాగంగా 2023 సంవత్సరానికి 'రెప్పవాలని రాత్రి' కవితా సంపుటిని ఎంపిక చేశారు. రెప్పవాలని రాత్రి కవితా సంకలనాన్ని అందించిన వరంగల్ జిల్లాకు చెందిన కవి, రచయిత వంశీకృష్ణకు అవార్డును ప్రదానం చేయనున్నారు. ఆదివారం సిరిసిల్ల రంగినేని ట్రస్ట్‌లో జరిగే ఎల్లమ్మ పురస్కార మహోత్సవానికి ఈనాడు సంపాదకుడు డీఎన్ ప్రసాద్, కవి, వాగ్గేయకారుడు అందెశ్రీ అందజేయనున్నారు. అఖిలభారత తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, ట్రస్ట్ అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఎన్‌టీవీ సహాయ సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్, పురస్కారకమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్, రచయిత నారాయణశర్మ పాల్గొననున్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి



శివకల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 9: పురాతన ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి శివాలయంలో శివ కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారన్నారు. అనంతరం ఆది శ్రీనివాస్‌ను అర్చకులు ఆశీర్వదించారు. కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, ఫిరోజ్ పాషా, కచ్చకాయల ఎల్లయ్య, చందనగిరి గోపాల్, చేపూరి గంగాధర్, నందు గౌడ్, కిషన్ రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీడింగ్ 200లోపు తిరిగినా విద్యుత్ బిల్లు

గంభీరావుపేట, మార్చి 9: గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లులు రాక అయోమయానికి గురవుతున్నారు. 200 లోపు రీడింగ్ తిరిగినా జీరో బిల్లుకు బదులు విద్యుత్ బిల్లులు వస్తున్నాయని కొందరు విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. నర్మాలకు చెందిన బొంగు చిన్న మల్లయ్యకు చెందిన మీటరు కేవలం 87 యూనిట్ల రీడింగ్ తిరిగినా జీరో బిల్లుకు బదులు రూ.329 కరెంటు బిల్లు వచ్చింది. అదే విధంగా దమ్మన్నపేటకు చెందిన గొల్లపల్లి నారాగౌడ్ 142 యూనిట్లు మీటరు తిరిగితే జీరో బిల్లు రావల్సిందిపోయి రూ.646 బిల్లు వచ్చిందని పేర్కొన్నాడు. 200లోపు రీడింగ్ తిరిగినా కరెంట్ బిల్లులు వస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం 200లోపు విద్యుత్ మీటరు రీడింగ్ తిరిగితే బిల్లు కట్టనవసం లేదని చెబుతోందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మోసపూరిత హామీలతో గోసపెడుతున్న కాంగ్రెస్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, మార్చి 9: మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రజలను గోసపెడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ నాయకత్వంలో మారుమూల వీర్నపల్లి గ్రామం మండలంగా ఏర్పడిందని గుర్తు చేశారు. రూ.5 కోట్లతో మండల కేంద్రంలో అద్భుతమైన పాఠశాలను నిర్మించుకుంటున్నామన్నారు. 2009 నుంచి ఇప్పటి వరకు ఐదోసారి ఎమ్మెల్యేగా ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందానన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ మాయమాటలు చెప్పడంతో ప్రజలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేసి గెలిపించారని, ఇప్పుడు గోస పడుతున్నారని అన్నారు. హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలను మోసం చేసిందన్నారు. బస్సు ఫ్రీ, బంగారం ఫ్రీ అంటూ మహిళలతో ఓట్లు వేయించుకుందన్నారు. ఇప్పుడు ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ప్రజలు ఒక దొంగ చేతిలో పెట్టారన్నారు. ప్రభుత్వాన్ని నడపడం చేతకాక బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం అంటే తెలియని కాంగ్రెస్ వాళ్లు కొట్టుకుపోయిందని, కేసీఆర్ లక్షల కోట్లు తిన్నారని దిక్కుమాలిన మాటలు మాట్లాడడం సరికాదన్నారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదని మేడిపల్లి, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు ఉన్నాయన్నారు. బీజేపీ ఎంపీగా ఉన్న బండి సంజయ్ మారుమూల వీర్నపల్లి మండలానికి ఎన్ని నిధులు తీసుకొచ్చారో చెప్పాలన్నారు. పనులు చేయలేని నాయకుడు ఎంపీగా ఉండడం ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలు కాంగ్రెస్, బీజేపీ మాటలకు మోసపోకుండా పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

గిరిజనుల సంక్షేమానికి కేసీఆర్ కృషి

గిరిజనుల సంక్షేమం కోసం అన్ని రకాలుగా కృషి చేసింది కేసీఆరేనని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జాన్సన్‌నాయక్ అన్నారు.కార్యకర్తల సమావేశంలో గిరిజనులను ఉద్దేశించి బంజారా భాషలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం గతంలో గిరిజనులకు పది శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తూ హైదరాబాద్‌లో బంజారా భవన్, కొమురంభీం భవన్ నిర్మించినట్లు పేర్కొన్నారు. నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, పార్లమెంట్ ఎన్నికల సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి తుల ఉమ, జిల్లా అధ్య క్షుడు తోట ఆగయ్య రాష్ట్ర నాయకులు దరువు ఎల్లన్న, చీటి నర్సింగారావు, ఎంపీపీ మాలోతు భూల, జడ్పీటీసీ గుగ్లోతు కళావతి, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కళ, యూత్ అధ్యక్షుడు సామల్ల దేవరాజు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, సెస్ డైరెక్టర్ మల్లేశం, మండల కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, మాజీ మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు ఎడ్ల సాగర్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీరాంనాయక్, నాయకులు, మాజీ ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవి, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పట్టించుకోకుండా తప్పించుకుంటోందని, ఆ పార్టీని, అభివృద్ధి చేయని బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో బొంద పెట్టాలని కేటీఆర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిశివ గార్డెన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు సాగు నీరు లేక నెర్రలు పారుతున్నాయన్నారు. కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు మోసపూరిత సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీని వేటాడేందుకు ప్రతీ కార్యకర్త సిద్ధంగా ఉండాలని సూచించారు. కరీంనగర్‌లో ఈ నెల 12న నిర్వహించే కదనభేరీ సభను విజయవంతం చేయాలన్నారు. కేటీఆర్ మాట్లాడుతున్న క్రమంలో శివరాత్రి దేవరాజు అనే కార్యకర్త ఒక్కసారిగా ఫిట్స్‌కు గురయ్యాడు. ఆయనను నాయకులు ఆసుపత్రికి తరలించారు. అంతకు ముందు మండలంలోని గుండారం మాజీ సర్పంచ్ శంకర్ గుండెపోటుతో శస్త్ర చికిత్స చేయించుకోగా పరామర్శించారు. అల్మాస్‌పూర్‌లో మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో భాగంగా స్వామి వారిని దర్శించుకున్నారు. సమావేశంలో సెస్ చైర్మన్ రామారావు, జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు నర్సింగారావు, జాన్సన్‌నాయక్, బాల్‌రెడ్డి, తిరుపతి, లక్ష్మణ్, సందీప్, సీత్యానాయక్, రమేశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

ఇల్లంతకుంట, మార్చి 9: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం ఉంటుందని మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. గంగాధర ఆలయంలో సమావేశం ఉంటుందని, అన్ని గ్రామాల నాయకులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముస్తాబాద్‌లో తాగునీటి కష్టాలు



ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్న సిబ్బంది

ముస్తాబాద్, మార్చి 9 : ముస్తాబాద్ మండల కేంద్రంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. స్థానిక ఇందిరమ్మ కాలనీలో తాగు నీటి కొరత మొదలవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి సంపుల్లో నింపుతున్నారు. అయినా నీరు సరిపోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ లేదని పేర్కొన్నారు. తాగు నీటి కష్టాలు మార్చి మొదటి వారంలోనే మొదలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోవాలని కోరారు.

ఆసాములకు ఉపాధి కల్పించాలి



సిరిసిల్లలో రిలేదీక్షలో ఆసాములు

సిరిసిల్ల రూరల్, మార్చి 9 : ఆసాములు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో భద్రావతి సంఘం ఆవరణలో ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శనివారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కోసం సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో భిక్షటాన చేసి నిరసన తెలపనున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని వేడుకున్నారు. ఈ దీక్షలో సభ్యులు గాజుల నరేష్, బచ్చురాములు, బూర కుమార్, పోరండ్ల శ్రీనివాస్, తెల్లభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

గంభీరావుపేట, మార్చి 9 : గంభీరావుపేట మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్ఎస్ మండలస్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు పార్టీ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించ తలపెట్టిన సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటు, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా బుగ్గ రాజరాజేశ్వరస్వామి జాతర



ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, మార్చి 9: రుద్రంగి మండల కేంద్రంలో వెలసిన బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం శివరాత్రి తెల్లవారుజామున ఆలయంలో ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్ స్వామివారిని దర్శించుకున్నారు. శివ భక్తుడు గోడికారి హిరోజి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, ప్యాక్స్ డైరెక్టర్ కెసిరెడ్డి నర్సరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, సామ మోహన్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, ఇప్ప మహేష్, పల్లి గంగాధర్, అభిలాష్, పిడుగు లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానాల శంభు లింగేశ్వరస్వామి కల్యాణం

రుద్రంగి మండలం మానాల గ్రామంలోని భవానీ శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జాతరలో భాగంగా భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శంభు లింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ పిసిరి చిన్న భూమయ్య, మాజీ సర్పంచ్ మానస, జక్కు మోహన్, తిక్క భూమన్న, జక్కు వంశీ, బాదనవేణి రాజరాం, రవీందర్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 9: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గొడిశాల శేఖరయ్య అనే గీత కార్మికుడు శనివారం తాటి చెట్టు పైనుంచి కిందపడి గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వృత్తిలో భాగంగా శేఖరయ్య తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారటంతో జారి కిందపడి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ.10వేల నగదు, బంగారం అపహరణ

కోనరావుపేట, మార్చి 9: కోనరావుపేట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి నగదుతో పాటు బంగారం అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సామ నరసింహారెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కూరగాయలను అమ్మడానికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కిటికీలో నుంచి ఇంట్లోకి చొరబడి బీరువా పగలగొట్టి పదివేల రూపాయల నగదు, అర్ధతులం బంగారం అపహరించారు.

నరసింహారెడ్డి కూరగాయలు అమ్మిన అనంతరం రాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి కిటికీ నుంచి గుర్తు తెలియన వ్యక్తి వచ్చి బీరువా పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు గుర్తిం చాడు. ఈ విషయమై కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లో ముదురుతున్న సంక్షోభం

● పార్టీ నుంచి ఐదుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్

వేములవాడ, మార్చి 9: వేములవాడ పురపాలక సంఘం పరిధిలో బీఆర్ఎస్ పార్టీలో సంక్షోభం ముదురుతోంది. శాసనసభ ఎన్నికలలో ఓటమితో ఇప్పటికే ఆ పార్టీ కార్యకర్తలలో మనోధైర్యం దెబ్బతినగా, ఎన్నికల అనంతరం ఆ పార్టీ కౌన్సిలర్లు కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఆ పార్టీకి మరింత తలనొప్పిగా మారి ఐదుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్‌కు దారితీసింది. మార్చి 7వ తేదీన జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారం కుమార్ ఓటమిపాలయ్యారు. సొంత పార్టీకే చెందిన కౌన్సిలర్లు పార్టీ విప్‌ను కూడా ధిక్కరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బింగి మహేష్‌కు ఓటు వేశారు. దీంతో మారం కుమార్‌కు ఓటమి తప్పలేదు. ఈ ఎన్నికపై పోస్టుమార్టం నిర్వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసి బాధ్యత రాహిత్యంగా ప్రవర్తించారంటూ రెండు మిద్దెల జయ(2వ వార్డు), యాచమనేని శ్రీనివాసరావు(11వ వార్డు), జడల లక్ష్మి(5వ వార్డు), మధు రాజేందర్ శర్మ(23వ వార్డు), ముప్పిడి సునంద(26వ వార్డు)లను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన మిగతా వారిపై సైతం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. అయితే ఈ ఐదుగురు కౌన్సిలర్లు టీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని భావించి వారిని పార్టీ నుంచి ఆగమేఘాలపై సస్పెండ్ చేసినట్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా టీఆర్ఎస్ పార్టీకి తామే రాజీనామా చేస్తున్నామని మున్సిపల్ కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, మధు రాజేందర్ శర్మ, జడల లక్ష్మి, ముప్పిడి సునంద ప్రకటించారు. వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో పార్టీ కౌన్సిలర్ల నుండి అభిప్రాయాలు సేకరించలేదని, అభ్యర్థి ఎంపిక విషయంలో కనీస విధివిధానాలు పాటించలేదని వారు ఆరోపించారు. ఏకపక్ష విధానాలతో వ్యవహరిస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్న తీరుకు నిరసనగా తాము బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని వారు ప్రకటించారు. మొత్తం మీద అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నుంచి ప్రారంభమైన రాజీనామాలు, వలసలు రోజురోజుకు పెరుగుతుండడం బీఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని కలవరపెడుతోంది. టీఆర్ఎస్ పార్టీలోని మరికొందరు కౌన్సిలర్లు సైతం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని స్థానిక రాజకీయ వర్గాలలో జోరుగా చర్చ సాగుతోంది.

తాట్లవాయి హత్యపై వీడిన మిస్టరీ?

● పోలీసుల అదుపులో నిందితుడు? ● కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం

రాయికల్, ఫిబ్రవరి 9: మండలంలోని తాట్లవాయి గ్రామానికి చెందిన నాగెల్లి సురేష్(24) అనే యువకుడి హత్య మిస్టరీని పోలీసులు శనివారం చేధించినట్లు తెలిసింది. ఈ హత్యకు పాత కక్షలే కారణమని, హత్యకు పాల్పడిన వ్యక్తి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుని ఆచూకీ తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని హత్య మిస్టరీని చేధించినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు హత్యకు ఉపయోగించిన కత్తి, నిందితుడి సెల్‌ఫోన్‌ను హతుడి వ్యవసాయ బావిలో నుంచి పోలీసులు శనివారం బయటకు తీసినట్లు సమాచారం. ఈ హత్యకు పాల్పడిన వ్యవహారంలో ఎందరి పాత్ర ఉందోనని పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది.

మహిళ దారుణ హత్య

● నిందితుల కోసం పోలీసుల గాలింపు


మల్లవ్వ (ఫైల్)

వీర్నపల్లి, మార్చి 9: వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామానికి చెందిన శివరాత్రి మల్లవ్వ (42)ను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వచ్చి హతమార్చినట్లు భావిస్తున్నారు. డాగ్‌స్క్వాడ్‌లు సైతం పసిగట్టని విధంగా మహిళ మృతదేహంతో పాటు ఇంటి పరిసరాల్లో కారంపొడి చల్లి దుండగులు పరారయ్యారు. కిరాతక హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పలువురు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లవ్వ కొంతకాలం క్రితం భర్తతో విడాకులు తీసుకుని తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. ఇద్దరు కుమారుల్లో ఒకరు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మరో కుమారుడు శేఖర్ తంగళ్లపల్లిలో కూలి పని చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. తల్లిగారి ఇంటి వద్ద ఒంటరిగా నివాసం ఉంటున్న మల్లవ్వను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పథకం ప్రకారం అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగులు ఇద్దరు అర్ధరాత్రి పూట రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని మల్లవ్వ వివరాలు అడిగినట్లు సమాచారం. అర్ధరాత్రి ఒంటరిగా ఇంట్లో నివసిస్తున్న మల్లవ్వను గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్లవ్వను హత్య చేసిన దుండగులు శరీరంపై కారం చల్లి ఆనవాళ్లు గుర్తు పట్టరాకుండా చేసి పరారయ్యారు. శనివారం ఉదయం అటుగా వచ్చిన గ్రామస్థులు మల్లవ్వ మృతదేహాన్ని గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. నిందితుల కోసం ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్, వీర్నపల్లి ఎస్ఐ రమేష్, అర్ఎస్ఐలు జునైద్, సాయికిరణ్, పోలీస్ ప్రత్యేక బృందం గాలింపు కొనసాగిస్తోంది. మృతురాలి తమ్ముడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ మహాసభలు

సుభాష్‌నగర్, మార్చి9: జిల్లా కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్ చేస్తున్న న్యాయమైన పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.మందులపై ధరలను తగ్గించాలని, జీఎస్టీని తొలగించాలని, నాసిరకం మందులను అరికట్టాలన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేధించాలని మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ చేస్తున్న పోరాటాలను ఆయన కొనియాడారు. అనంతరం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కె రమేశ్‌సుందర్ మాట్లాడుతూ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ ఆక్ట్-1976ను పరిరక్షించాలన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్‌లకు చట్టబద్ధమైన పనివిధానాలను కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కరీంనగర్ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మా రంగంలో జరుగుతున్న అనైతిక కార్యక్రమాలను ఉమ్మడి పోరాటాలతో అరికట్టాలన్నారు. అనంతరం తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు భట్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపి వేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ కరోనా కాలంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ చేసిన సేవలను కొనియాడారు. ఈ మహాసభలో ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ నాయకుడు రాంమోహన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకుడు సత్యనారాయణరెడ్డి, డీవైఎఫ్ఐ నాయకుడు తిరుపతి, ఐద్వా నాయకురాలు నాగమణి, జనవిజ్ఞాన వేదిక నాయకుడు రామరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు స్వామి, రాజు, రాజమల్లు, సురేష్, రాజేశం, ఎఫ్ఎంఆర్ఏఐ సహాయ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, టీఎంఎస్ఆర్‌యూ అధ్యక్షుడు భానుకిరణ్, సహాయ కార్యదర్శి నాగేశ్వర్, కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శులు సిహెచ్ శ్రీధర్, సదానందచారి, కె ఐలయ్య, సయ్యద్‌సిద్ధిక్, ఎం అంజయ్య పాల్గొన్నారు.

వెళ్లొస్తాం..రాజన్నా

● వేములవాడలో ముగిసిన మహాశివరాత్రి జాతర ● తిరుగు ముఖం పట్టిన భక్తులు


వేములవాడ నుంచి తిరిగి వెళ్తున్న భక్తులు

వేములవాడ మార్చి 9: 'ఆపదమొక్కుల రాజన్న దయ ఉంచు.. వచ్చే సంవత్సరం జాతరకు మళ్లీవస్తాం' అంటూ రాజరాజేశ్వర స్వామి భక్తులు వేములవాడ నుంచి తిరుగు ముఖం పట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఇళ్లకు తిరిగి వెళ్లారు. గురువారం ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి జాగరణ పాటించిన భక్తులు తెల్లవారుజామునే ఉపవాసం విడిచారు. పలువురు భక్తులు నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు. అనుబంధాలయమైన బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అభిషేక పూజలో మంత్రి, ప్రముఖులు

మహా శివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో నిర్వహించిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం రోజున రాజరాజేశ్వర స్వామి వారి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలో పాల్గొంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి పాల్గొన్నారు. ఐఏఎస్ అధికారులు కృష్ణభాస్కర్, లక్ష్మీ పార్థసారథి, ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనీ ఎస్పీ రాహుల్ రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు లింగోద్భవ పూజలో పాల్గొన్నారు. అనంతరం శనివారం తెల్లవారుజామున వీరికి అర్చకులు ఆశీర్వచనం గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో డి కృష్ణప్రసాద్, ఏఈఓ హరికిషన్, ఆర్డీఓ రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

జాతర విజయవంతం : విప్ ఆది శ్రీనివాస్

అందరి సహకారం, సమన్వయంతో మహాశివరాత్రి జాతర విజయవంతమైందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడగలిగామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నర కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రత్యేక చర్యలు చేపట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించిందన్నారు. జాతర విజయవంతంగా జరగడానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంతో సహకరించారని, జాతర ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు అందజేశారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఉంటూ పర్యవేక్షణ చేసిన స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులకు విప్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్టీసీ సంస్థ దాదాపు 400 బస్సులను కేటాయించి 3వేల ట్రిప్పులు నడిపిందని అన్నారు. దాదాపు 3 లక్షలకు పైగా మంది భక్తులు తరలి వచ్చి రాజన్నను దర్శించుకున్నారని వివరించారు.

జాతర సందర్భంగా రాజన్న ఆలయ ఆర్జిత సేవల ద్వారా తొలిరోజు ఏడవ తేదీ 24 లక్షల 22 వేల 392 రూపాయలు, రెండవ రోజు ఎనిమిదవ తేదీ 74 లక్షల 6 వేల 600 రూపాయల ఆదాయం సమకూరిందని ఈవో డి కృష్ణప్రసాద్ తెలిపారు.

భక్త జనంతో కిక్కిరిసిన దుబ్బరాజన్న క్షేత్రం

సారంగాపూర్, మార్చి 9: మండలంలోని శ్రీ దుబ్బ రాజన్న క్షేత్రం భక్తజనంతో కిక్కిరిసి పోయింది. మహా శివరాత్రి ఉపవాసాలతో జాగరణ చేసిన భక్తులు ఉదయాన్నే కోనేరులో స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్‌లో నిలబడి స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తులు గండదీపం, కోడెమొక్కులు, తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం స్వామి వార్లకు అన్న ప్రసాదం, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ధర్మపురిలో రాజేశ్వరుడి రథోత్సవం

ధర్మపురి, మార్చి 9: ధర్మపురి క్షేత్రంలో శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి, శ్రీ రామ లింగేశ్వరస్వామి, నేరెళ్ల, జైనాలో శ్రీసాంబ శివుని రథోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, జన్మంచి శ్రీనివాస్, ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య శివ పార్వతుల ఉత్సవ మూర్తులను రథాలపై ఆశీనులు చేశారు. అనంతరం శ్రీ అక్కపెల్లి ఆలయం నుంచి నంది విగ్రహ చౌరస్తా వరకు రథాన్ని ఊరేగించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కళ్యాణం జరిపారు. జైనాలో స్వామివారల సేవను ఊరేగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.


వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు



దుబ్బరాజన్న ఆలయంలో అన్నప్రసాద అలంకరణలో స్వామివారు, భక్తులు


ధర్మపురి శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి రథోత్సవం

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు

● నలుగురు నిందితుల అరెస్టు ● పరారీలో మరో ఇద్దరు

జగిత్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ రూ. లక్షలు గడిస్తున్న ఓ అంతర్రాష్ట్ర ముఠా గుట్టును జగిత్యాల పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ వారి వద్ద వివిధ విశ్వ విద్యాలయాలు, బోర్డుల పేరిట సృష్టించిన 395 నకిలీ సర్టిఫికెట్లు, ఒక కంప్యూటర్, ఒక ల్యాప్ టాప్, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన కొడితెల మహేశ్ అనే యువకుడు ఇటీవల గల్ఫ్ దేశం వెళ్లడానికి పాస్ పోర్టు కోసం ప్రయత్నం చేశాడు. పాస్‌పోర్టు దరఖాస్తుతో జతపరచడానికి పదో తరగతి సర్టిఫికెట్ అవసరం కావడంతో అదే గ్రామానికి చెందిన కొక్కరకాని చంద్రయ్య అలియాస్ చందును సంప్రదించాడు. తన సమీప బంధువు అయిన కరీంనగర్‌కు చెందిన బత్తినోజు రజిత, బత్తినోజు శ్రావణ్ కుమార్‌లు ఎవరికి అనుమానం రాకుండా నకిలీ సర్టిఫికెట్లు ఇస్తారని మహేశ్‌కు చంద్రయ్య సమాచారం అందించాడు. దీంతో చంద్రయ్య సహాయంతో మహేశ్ కరీంనగర్‌లోని రజిత, శ్రావణ్ కుమార్‌లను సంప్రదించగా రూ. 28 వేలకు ఒప్పందం కుదుర్చుకొని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్, రూల్ నంబరు (16007125873) గల ఓపెన్ ఎస్ఎస్‌సీ నకిలీ సర్టిఫికెట్‌ను అందించారు. సదరు సర్టిఫికెట్‌తో పాస్‌పోర్టు కోసం మహేశ్ దరఖాస్తు చేసుకున్నాడు. ధర్మపురి స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ నర్సింగ్ రావు జరిపిన విచారణలో అది నకిలీ సర్టిఫికెట్‌గా గుర్తించారు. ఈ వ్యవహారాన్ని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు జగిత్యాల పోలీసు ఉన్నతాధికారులకు వివరించడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మపురి పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం మరింత లోతుగా విచారణ జరపడంతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. కరీంనగర్‌కు చెందిన రజిత, శ్రావణ్ దంపతులు సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో తమకు జస్ట్ డయల్ ద్వారా పరిచయమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్‌ల సహాయంతో సుమారు ఐదేళ్లుగా నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌కు రూ. 30 వేలు, డిగ్రీ సర్టిఫికెట్‌కు రూ. 40 వేలు, ఇంజనీరింగ్ సర్టిఫికెట్‌కు రూ.50 నుంచి రూ.60 వేలు వసూలు చేస్తూ కోరుకున్న సంవత్సరంలో కోరుకున్న పేరు మీద సూచించిన యూనివర్సిటీ, బోర్డుల పేరిట సృష్టించి విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. సుమారు ఐదేళ్ల కాలంలో సుమారు 395 నకిలీ సర్టిఫికెట్లు విక్రయించి సుమారు రూ. 15.41 లక్షలు వసూలు చేసినట్లుగా పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో కరీంనగర్‌లోని రాంనగర్ కాలనీలో సొంతింట్లో నివాసమున్న బత్తినోజు రజిత, బత్తినోజు శ్రావణ్ కుమార్‌లను, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామంలోని నివాసంలో కొడిచాల మహేశ్, కొక్కరకాని చంద్రయ్య అలియాస్ చందులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 395 నకిలీ సర్టిఫికెట్లు, 5 మొబైల్ ఫోన్లు, రూ. 25 వేల నగదు, ఒక ల్యాప్ టాప్, ఒక కంప్యూటర్ సీపీయూ, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని బరహంపూర్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు.



నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయం

కరీంనగర్ టౌన్, మార్చి 9: టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 21శాతం పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయమని ఐఎన్‌టీయుసీ అనుబంధ ఎస్‌డబ్ల్యూయు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. యూనియన్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మహమూద్, రాజిరెడ్డి కృషి ఫలితమేనని ఐఎన్‌టియుసీ రాష్ట్ర వైస్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ జక్కుల మల్లేశం గౌడ్, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు టీఆర్‌రెడ్డి, ఎన్‌కె రాజు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు , ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ముస్తాబాద్, మార్చి 9: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు యాదయ్య (54) విద్యుదాఘాతంతో మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదయ్య అనే రైతు తన పొలానికి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రెండు నెలలుగా ఫ్యూజ్ వైరు పడిపోతుంది. దీంతో పొలానికి నీరు సరిగా అందకపోవడంతో శుక్రవారం రాత్రి ఫ్యూజ్ వైరు సరిచేయాలని యాదగిరి ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి ఫ్యూజ్ వైరు సరిచేసే క్రమంలో విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో యాదగిరి మృతిచెందాడు. సెస్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. యాదగిరికి భార్య లక్ష్మీ, కూతుళ్ల దేవలక్ష్మీ, రమణ, కొడుకులు శేఖర్, రమేశ్ ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అతిపెద్ద జాతీయజెండా ఏర్పాటు చేయడం అభినందనీయం

రామడుగు, మార్చి 9: గ్రామీణ ప్రాంతాల్లో అతిపెద్ద జాతీయజెండా ఏర్పాటు చేయడం అభినందనీయమని, భారతదేశ ఔన్నత్యం, ఆశయాలకు జాతీయజెండా ప్రతిరూపమని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేటలో జాతీయజెండాను శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 56ఫీట్ల అతిపెద్ద జాతీయ జెండాను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. 77ఏళ్లుగా జాతీయజెండా దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. జాతీయ జెండాలో మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్, సావర్కర్ వంటి వారు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన నేతల త్యాగాలు గుర్తుకు వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మండలంలోని గోపాల్‌రావుపేటలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో అతిపెద్ద జాతీయ జెండా దేశం గర్వించేలా ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క, సంఘం అధ్యక్షులు కాసారపు పరుశరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.


జాతీయజెండాకు వందనం చేస్తున్న ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొండగట్టు ఘాట్‌రోడ్డుపై పర్యవేక్షణ ఏదీ?

● ఓవర్‌లోడ్‌తో ప్రయాణాలు.. పట్టించుకోని అధికారులు

మల్యాల, మార్చి 9: కొండగట్టు ఘాట్‌రోడ్డుపై రవాణా, పోలీసు ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో వాహనాల ఓవర్‌లోడ్, అతి వేగం తదితర నిబంధనలు విస్మరిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయిదేళ్ల క్రితం ఘాట్‌రోడ్డుపై ఆర్టీసీ బస్సు ప్రమాదంలో 67 మంది వరకు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం అనంతరం ప్రస్తుత ఘాట్ రోడ్డును మూసివేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. రెండు సంవత్సరాల క్రితం నిబంధనలతో కూడిన షరతులతో వాహనాల రాకపోకలను ప్రారంభించిన అధికారులు పలు శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలనే ఈఎన్‌సీ ఆదేశాలను పాటించడం లేదు. ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు దుర్మరణం చెందగా, వందలాదిగా గాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డు 1.2 కి.మీ. ఉండగా, గతంలో జరిగిన ప్రమాదాలు దృష్ట్యా, నిబంధనల మేరకు మలుపులతో కూడుకొని ఘాట్‌రోడ్డు 2.5 కిమీ.ఉంటేనే రాకపోకలకు అనుకూలమని ఇంజనీరింగ్ అధికారులు మరో ఘాట్‌రోడ్ కోసం సర్వే చేసి కొత్త రోడ్డుకు 3.6 కి.మీ మేర ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇంత వరకు ఆ ప్రతిపాదనలపై చర్యలు కనిపించడం లేదు. 2018 సెప్టెంబర్ 11న కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాద అనంతరం రాకపోకలను నిషేదించిన అధికారులు 2022 జూన్27న నిబంధనలతో కూడిన అనుమతులు ఇచ్చారు. 20స్పీడ్ లోపే వాహనాలను నడుపాల్సి ఉంటుంది. కండీషన్ గల కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. భారీ వాహనాలైన బస్సులు, లారీలు, మినీబస్సులు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలకు అనుమతి లేదు. ఓవర్‌లోడ్(ప్రయాణికులు, ఇతరాత్ర)తో వచ్చే ఎలాంటి వాహనాలకు అనుమతి ఉండదు. కిందకు వచ్చే వాహనాలు గేరులోనే రావాలి. న్యూట్రల్‌లో రాకూడదనే నిబంధనలున్నాయి.


ప్రమాదకరంగా ఉన్న కొండగట్టు ఘాట్‌రోడ్డు

ఘాట్‌రోడ్డుపై ఆటో బోల్తా - 11మందికి గాయాలు

కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం మ్యాదరిపేటకు చెందిన గందం జగన్ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో శనివారం ఘాట్‌రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న 12 మందిలో 11మందికి గాయాలయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అంజన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్డు మీదుగా కొండ దిగుతుండగా అదుపు తప్పిన ఆటో బోల్తాపడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో గల అర్వింద్, చంద్రయ్య, రాజేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో పరిమితికి మించి ఉండడం, న్యూట్రల్‌లో రావడంతోనే ఆటో అదుపు తప్పినట్లు సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తోంది. గాయపడిన వారంద రినీ చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

కదన భేరిని విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

తంగళ్లపల్లి, మార్చి 9: కరీంనగర్ కదనభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పిలుపునిచ్చారు. శనివారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు ప్రజలు భారీగా హాజరయ్యేలా నాయకులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు బండి దేవదాస్, పడిగెల రాజు, కోడూరి భాస్కర్ గౌడ్, అడగట్ల భాస్కర్, సిలివేరి నరసయ్య, భైరి రమేష్, గణప మదన్‌రెడ్డి, సిలువేరి చిరంజీవి, హమీద్, బండి జగన్, ఈసారి ఉమరాజు, నక్క రవి, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ నాగం కుమార్

చందుర్తి, మార్చి 9: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం మల్యాలలో ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో ఎస్సీ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండలానికి అధిక నిధులు మంజూరు చేయించారని, మండల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనులను వేగంగా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లారపు రాజయ్య ప్రసాద్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

వేములవాడ రూరల్, మార్చి 9: మహిళాదినోత్సవాన్ని శనివారం మండలంలోని ఫాజుల్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు , ఆశావర్కర్లను, ఏఎస్ఎంలను, మహిళా సంఘం సభ్యులను వైస్ ఎంపీపీ జక్కుల కవితతిరుపతి సన్మానించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాఘవరావు, ఏఎన్ఎం లత, ఆశ రాజేశ్వరి, అంగన్వాడి విజయ, రాజేశ్వరి, వీఓఏ జలజ, రాధ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, మహిళా సంఘం, సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇల్లంతకుంట, మార్చి 9: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బీటీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి, సభ్యులు బండారి రాజు, ప్రసన్న, మామిడి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జడ్పీ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు

ఇల్లంతకుంట, మార్చి 9: జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిల్లవేని పర్శరాం, సాదుల్, మీసరగండ్ల అనీల్‌కుమార్, ఎంద్ర చందన్, ప్రశాంత్‌రెడ్డి, కనుకయ్య, గుంటి మధు, అంజయ్య, రాములు, రఘు, మల్యాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువ పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, మార్చి 9: మండలంలోని రేపాకలో మురుగునీటి కాలువ పనులను ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం శనివారం ప్రారంభించారు. మురుగునీటి కాలువ లేక ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో రూ.2లక్షల అంచనాలతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దయాసాగర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 9: అర్హులందరికీ గృహజ్యోతి పథకం వర్తిస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లు మాఫీ ఉంటుందన్నారు. అర్హత ఉండి ఉచిత కరెంటు వర్తించని వారు ఆధార్, ప్రజా పాలన దరఖాస్తుతో మండల పరిషత్‌లో సంప్రదించాలని సూచించారు. గత ప్రభుత్వంలో నాయీబ్రాహ్మణ, రజకులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్తును యథావిధిగా కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను సాగిస్తోందన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాజేశం, రాజునాయక్, బాబు పాల్గొన్నారు.

జీరో బిల్లుల అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 9: ఎల్లారెడ్డిపేట మండలం గుండారం, రాగట్లపల్లి, హరిదాస్ నగర్, పదిర గ్రామాల్లో గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లును స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం ప్రారంభించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని అన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటును అమలు చేసి నిరుపేదల్లో వెలుగులు నింపుతోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, సెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

ఇల్లంతకుంట, మార్చి 9: మండలకేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఆదివారం ఏర్పాటు చేసినట్లు మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జడ్పీవైస్ చైర్మన్ కార్యాలయంలో జరిగే సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హజరవుతున్నందున అన్ని గ్రామాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోనరావుపేట, మార్చి 9 : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో దశరథ సేంద్రియ వ్యవసాయ క్షేత్రంవారి సౌజన్యంతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్ర నిర్వాహకుడు ఆదర్శ కుమార్ మాట్లాడుతూ ఈ క్రీడల్లో 60 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంగలి వెంకన్న, మిరియాల బాలాజీ, ఆసరి ఎల్లయ్య గంగుల శ్రీనివాస్, ఆసరి రాజు, మహేందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహా శివరాత్రి వేడుకలు

సిరిసిల్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి వేడుకలు కన్నుల పండువగా ముగిశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. శనివారం వేడుకల ముగింపులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శివకల్యాణాలు, రుద్రహోమాలు, పూర్ణ హుతి నిర్వహించారు. సిరిసిల్లలోని అతి పురాతనమైన రాజరాజేశ్వరస్వామి శివాలయంలో శివకల్యాణం, రుద్రహోమం, మహా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు గోశికొండ హన్మంతు పంతులు ఆధ్వర్యలో కల్యాణం నిర్వహించారు. దేవాదాయ శాఖ సంబంధించి విశ్వనాథ దేవాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈవో మారుతీరావుతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శివకల్యాణ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, రాజరాజేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం కృష్ణ, గౌడ సురేష్, రాపెల్లి లక్ష్మీనారాయణ, మేర్గు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామం నుంచి గంపలు డప్పుచప్పుళ్ల నడుమ ఆలయం వరకు తీసుకువచ్చారు. పుట్ట బండారం, నాగవల్లి, కల్యాణ పట్నం, పెద్ద పట్నం, తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బైండ్ల వారి గాండ్రింపులు మధ్య అగ్ని గుండాల ప్రవేశం గగుర్పొడిచింది. మహిళలు బోనాలు తీసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు కథ కళాకారులు తమ ఆటపాటలతో ఆకట్టున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల శివాలయంలో స్వామివారి కల్యాణోత్సవం

నారాయణపూర్ శివాలయంలో..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని శివాలయంలో శుక్రవారం రాత్రి శివ పార్వతుల కల్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. పురోహితులు వేణుగోపాలచారి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. స్వామి వారికి వేములవాడ రాజన్న ఆలయం వారు పట్టువస్త్రాలను సమర్పించారు. గ్రామ పుర వీధుల గుండా రథంపై శివపార్వతులు ఊరేగారు. డప్పుచప్పుళ్లు, మహిళలు, చిన్నారుల కోలాటాల నడుమ పార్వతి పరమేశ్వరులు ముందుకు కదిలారు. మహిళలు మంగళహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన ఎలవేని లింగం స్వామి వారి లడ్డును రూ.6 వేలకు వేలం ద్వారా దక్కించుకున్నారు. నిమ్మ బుచ్చిరెడ్డి, మోతె లక్ష్మారెడ్డిలుభక్తుకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అఫెరాసుల్తానా, మాజీ సర్పంచులు లక్ష్మీ, నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, ఆలయ కమిటీ చైర్మన్ నర్సయ్య, సుధాకర్‌రెడ్డి, భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి : బోయినపల్లి మండలంలోని విలాసాగర్ త్రిలింగ సంగమేశ్వరస్వామి ఆలయంతోపాటు బోయినపల్లి వెంకట్రావుపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో శివ కల్యాణం కన్నుల పండుగ సాగింది. శివ కల్యాణాన్ని భక్తులు తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు.

చందుర్తి : మండలంలోని ఎన్గల్ గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కల్యాణోత్సవానికి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆది శ్రీనివాస్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, నాయకులు సిరికొండ శ్రీనివాస్, ఎన్గంటి శంకర్, లింగంపల్లి సత్తయ్య, కుసుంబ జనార్ధన్, పులి మనోహర్, గుంటి గంగదర్, ప్రసాద్, లింగంపల్లి హన్మంతు, పొంచెట్టి రాకేష్, విజేందర్, పెరుక గంగారాజు, బొజ్జ మల్లేశం, కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శివ కల్యాణంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



సిరిసిల్లలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

కన్నుల పండువగా కల్యాణోత్సవం

సిరిసిల్ల రూరల్, మార్చి 9: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులోని నెమళ్ల గుట్టపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం మల్లన్న కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ జాతరకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహాశివరాత్రి సందర్భంగా గ్రామంలోని శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి యాదవ మహిళలు బోనాతో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం ఆలయంలో ఒగ్గు పూజారులు మల్లన్న పట్నాలు వేశారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పట్నాలు వేశారు. తెలంగాణ పౌరసరఫరాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, కౌన్సిలర్ పోచవేణి సత్య ఎల్లయ్య మాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. అనంతరం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానాన్ని నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో నాయకుల పూజలు

ఐకమత్యంతోనే ముందడుగు

ముస్తాబాద్, మార్చి 9 : ఐకమత్యంతోనే ముందడుగు సాధ్యమని మాజీ జడ్పీటీసీ మెర్గు యాదగిరిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వీ కన్వెన్షన్‌లో ఈ నెల 10వ తేదీన సన్మానించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి గౌడ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. గీత కార్మికులు హాజరుకావాలని కోరారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో పొన్నం కీలక పాత్ర పోషించారని, ఎంపీల ఫోరం కన్వీనర్‌గా, మార్క్ ఫెడ్ చైర్మన్‌గా, మంత్రిగా ప్రతీ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. గౌడ సంఘం మండల అధ్యక్షులు కొండ యాగరిగడ్, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు తాటిపెల్లి శ్రీనివాస్, జిల్లా ప్రతినిధులు గుగ్గిళ్ల జగన్ గౌడ్, బుర్ర వెంకటేశంగౌడ్, దేవాదాసుగౌడ్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, ఉపేంద్రగౌడ్, పల్లె సత్యంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

ఎల్లారెడ్డిపేట, మార్చి 9: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిశివ గార్డెన్‌లో బీఆర్ఎస్ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు కేటీఆర్‌కు వినతి పత్రం అందజేశారు. పలు గ్రామాలకు చెందిన పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన కేటీఆర్ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వినికిడి యంత్రాలు ఇప్పించండి

గంభీరావుపేట: తమ పిల్లలను ఆదుకోవాలని ఓ కుటుంబం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను వేడుకుంది. శనివారం గంభీరావుపేట మండలం గజసింగవరంలో కేటీఆర్ ను కలిసి విన్నవించారు. లావణ్య, శ్రీనివాస్ అనే దంపతులకు ముగ్గురు కూతుళ్లు. అందులో ఇద్దరు మూగ, వినికిడి సమస్యతో బాధపడుతున్నారని కేటీఆర్‌కు మొరపెట్టుకున్నారు. ఎలాగైన వినికిడి యంత్రాలను ఇప్పించాలని కోరగా, వెంటనే స్పందించిన కేటీఆర్ వినికిడి యంత్రాలను ఇప్పిస్తానని హామి ఇచ్చారు.

మండంలోని గజసింగవరం గ్రామానికి చెందిన పంతం నవ్య, నాంపెల్లి దంపతులు న్యాయం చేయాలని కేటీఆర్ ఎదుట కన్నీటి పర్యాంతమయ్యారు. తమ కూతురు లాస్యను రెండేళ్ల కిందట ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు ఇవ్వగా, అత్తింటివారి వేధింపులతో చనిపోయిందని విలపించారు. తమ కూతురును హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని విన్నవించారు. తమ కూతురు మరణానికి కారణమైన ఐదుగురిపై ఫిర్యాదు చేస్తే, అందులో ఇద్దరిపైనే కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. అధికారులతో మాట్లాడి న్యాయం జరిగే విధంగా చూస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్ వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణ రావు, నాయకులు దయాకర్‌రావు, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, రాజారాం, శేఖర్‌గౌడ్, లింగమ్‌యాదవ్, మల్లేశం, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ కూలీల వేతనం చెల్లించాలి

తంగళ్లపల్లి, మార్చి 9: ఉపాధిహామీ కూలీలకు మూడు నెలలుగా వేతనం పెండింగ్‌లో ఉందని, వెంటనే చెల్లించాలని సీపీఐ కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ యూత్ క్లబ్‌లో నిర్వహించిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో జిల్లాలో లక్ష పదివేల మంది పనిచేస్తున్నారని, వీరికి మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి నిధులు కోత పెడుతోందని, పథకాన్ని నిర్వీర్యం చేయడానికి చూస్తోందని అన్నారు. సంవత్సరంలో 200 రోజులు పని కల్పించి రోజుకు ఒక్కొక్క కార్మికుడికి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మేనిఫెస్టోలో పెట్టి ఓట్లు అడగాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ తీర్మానాలను ప్రకటించారు. కట్కూరు వద్ద చెక్ డ్యామ్ నిర్మాణంలో అవినీతి జరగడంతో చెక్ డ్యామ్ తెగిపోయిందని కారకుడైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, చీర్లవంచ, చింతల్‌తానాలో నిర్వాసితులకు రావాల్సిన పరిహారం చెల్లించాలని, ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత యువతకు జీవన భృతి రూ.2 లక్షల రూపాయలను ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. ఇసుక మాఫియా ఆగడాలను అరి కట్టాలన్నారు. సీపీఐ నాయకులు సోమ నాగరాజు, గణాధి రాజయ్య అలుగునూరి బాలయ్య సోమ రాజశేఖర్, సోమ వెంకటేశం, ముస్తాబాద్ దేవయ్య, రాములు, దేవయ్య పాల్గొన్నారు.

● **నూతన కమిటీ**

సీపీఐ మండల కార్యదర్శిగా రాళ్లపేటకు చెందిన సోమ నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సహాయ కార్యదర్శిగా బచ్చుపెల్లి శంకర్, కోశాధికారిగా రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ మహాధర్నాకు దూరంగా ఉంటాం



సిరిసిల్లలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 9: బీఆర్ఎస్ మహాధర్నాకు దూరంగా ఉంటామని చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ అన్నారు. సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో శనివారం వస్త్ర వ్యాపారానికి సంబంధించిన పలు సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బతుకమ్మ చీరలకు సంబంధించిన రూ.300 కోట్లను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందన్నారు. అధికారం పోగానే ఆ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాలంటూ మహాధర్నా చేస్తామని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.300 కోట్లు అప్పుడే అందిస్తే ఇప్పుడు వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉండేదికాదన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని, పరిశ్రమలను మూత పడేస్థాయికి తీసుకొచ్చారని అన్నారు. బతుకమ్మ చీరల బకాయిలపై బీఆర్ఎస్ చేపట్టే మహాధర్నాకు వస్త్ర వ్యాపార సంఘాలు దూరంగా ఉంటాయని ప్రకటించారు. బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించడంతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లు ఇవ్వాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసినట్లు చెప్పారు. త్వరలోనే అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరల ఆర్డర్‌లను అప్పులు చేసి చేసి అందజేశామని, ఆ డబ్బులను పెండింగ్‌లో పెట్టడంతో వ్యాపారులంతా అప్పుల్లో కూరుకుపోయారని అన్నారు. గత ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారంలో ఉన్న నాయకుల చుట్టూ మూడు నెలల నుంచి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. బకాయిలను చెల్లించడంతోపాటు కొత్త ఆర్డర్‌లను అందించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమతోపాటు కార్మికులను ఆదుకోవాలని కోరారు. చేనేత వస్త్ర వ్యాపార సంఘం సభ్యులు ఎనుగుల ఎల్లయ్య, గౌడరాజు, పాలిస్టర్ అసోషియేషన్ సభ్యులు బూట్ల నవీన్, గోవిందు రవి, శ్రీరాం సత్యనారాయణ, మల్లేశం, యారన్ అసోషియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, దుబాల మోండయ్య, సైజింగ్ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు గౌడ సురేష్, వేముల వెంకటనర్సయ్య, గాజుల రవి, డైయింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు చిలుక రాజేశం, కోడం శ్రీనివాస్, కాటన్ క్లాత్ ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనారాయణ, కోక్కుల వెంకటేశం, వ్యాక్స్ సంఘాల అసోషియోషన్ అధ్యక్షుడు యెల్దండి శంకర్, వేముల దామోదర్, బోడ్డు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం వద్ద అన్నదానం

తంగళ్లపల్లి, మార్చి 9: మహాశివరాత్రి సందర్భంగా తంగళ్లపలి మండల కేంద్రంలోని శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ పడిగెల మానస రాజు ప్రారంభించారు. శనివారం పురాతన శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా సిరిసిల్లప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి- నవ్య దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్యాక్స్ చైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్ గౌడ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, మోర లక్ష్మీరాజం, జాగృతి మండల అధ్యక్షులు కందుకూరి రామగౌడ్, ఎంపీటీసీలు ములిగె దుర్గాప్రసాద్, సిలివేరి నరసయ్య ఆంజనేయులు, ఆసాని జయశ్రీ, కోడం సంధ్యారాణి, ఆసాని లావణ్య, దేవాలయ పూజారులు దిడ్డి భాస్కర్, శ్రీకాంత్ పాల్గొన్నారు

ఎక్సైజ్ సీఐకి ఆత్మీయ సన్మానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 9: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐగా పని చేసి బదిలీపై వెళ్లిన ఎంపీఆర్ చంద్రశేఖర్‌ను స్థానిక గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాలువా, పూలమాలతో సన్మానించారు. ఇక్కడకు బదిలీపై వచ్చిన సీఐ శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, బాలగౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై పెరిగిన అత్యాచారాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 9: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు పెరిగాయని, దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను అన్ని మతాలు ద్వితీయ శ్రేణిగా అణచివేశాయన్నారు. రాష్ట్రపతి ద్రౌపతిముర్మును నూతన పార్లమెంట్ భవనం, అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి పిలువకుండా అవమానించడాన్ని దేశం చూసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహిళల ఓట్లకోసం చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చారన్నారు. మహిళలపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు బిల్లు పాస్ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, కవి, రచయిత పూజం గోపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి జివ్వాజి విమల, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఐద్వా నాయకరాలు లక్ష్మీ, సులోచన, శారద, గాయత్రి, గీత, లక్ష్మీ, పూజ, నర్సవ్వ, సీఐటీయూ నాయకులు గణేష్, నక్క దేవదాస్ పాల్గొన్నారు.



ఐద్వా సదస్సులో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

పద్మశాలీలపై కేసీఆర్, కేటీఆర్ నిర్లక్ష్యం

సిరిసిల్ల టౌన్, మార్చి 9: మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ పద్మశాలీలను వాడుకొని, ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తున్నారని కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప అన్నారు. శనివారం సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్ల పద్మశాలీలపై కేసీఆర్, కేటీఆర్‌కు కోపం ఉందన్నారు. సిరిసిల్లలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేయాలని 2013-14లో మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేశారని, విగ్రహం ఏర్పాటులో అలసత్వం ప్రదర్శించడంతో నిరసన వ్యక్తం చేసిన తమపై కేసులు పెట్టారని అన్నారు. నాడు ప్రభుత్వంతో కొట్లాడితేనే కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. పద్మశాలీలపై ప్రేమ ఉన్నట్టు గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కేటీఆర్ సిరిసిల్ల పద్మశాలీలు, బతుకమ్మ చీరలపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు పద్మశాలీలకు ఏదో చేస్తానంటూ ధర్నా చేస్తామనడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బతుకమ్మ చీరలకు ఆర్డర్ ఇచ్చి డబ్బులు ఎందుకు ఇవ్వలేదన్నారు. అసెంబ్లీలో మాట్లాడకుండా సిరిసిల్ల పద్మశాలీలను, కార్మికులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. ధర్నాతో నష్టపోయేది మనమేనని, సిరిసిల్ల వ్యాపారులు, కార్మికులు ఆలోచించాలని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోతే మనకే నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు మనకే అనుకూలంగా ఉన్నారన్నారు. బతుకమ్మ చీరలకు ఆర్డర్లు ఇస్తారని, బకాయిలను విడదల చేస్తారని అన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందే వైన్స్‌కు టెండర్లు వేసి వచ్చిన డబ్బులుతోపాటు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందన్నారు. దీంతో ప్రభుత్వం వద్ద ఖజానా లేక ఆలస్యం అవుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు పని కల్పించాలని రూ. 64 లక్షల ఆర్వీఎం ఆర్డర్లు ఇచ్చిందన్నారు. కార్మికులకు 365రోజులు పని కల్పించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందన్నారు. ఆసాముల సంఘం నాయకుడు రవితో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేనందున బకాయిలు దశలవారీగా వస్తాయని చెప్పారన్నారు. పద్మశాలీలు కల్లు గుడాలు తింటున్నారని పరువు తీసిన మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసులు పెడతామని, మా ఆత్మభిమానం దెబ్బతీసిన కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని ప్రక్షంలో ప్రతీరోజు సిరిసిల్లలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యెల్ల లక్ష్మీనారాయణ, నాయకులు కొక్కుల వెంకటేశం, బూట్ల నవీన్, తాటిపాముల దామోదర్, గుండ్లపెల్లి గౌతం, వేముల దామోదర్, దుబాల వెంకటేశం, ద్యావనపెల్లి రామకృష్ణ, వెల్ది రమేష్, గాజుల సాగర్, బీటీపేట కుమార్, బండారి అశోక్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప